1
నవతెలంగాణ
ఆదిలాబాద్
మంగళవారం | ఫిబ్రవరి 06, 2024 | www.navatelangana.com

కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ఉట్నూర్

ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడపడుచులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వరమని అన్నారు. త్వరలో లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఉచితంగా బస్సు ప్రయాణం మొదలు పెట్టిందన్నారు. త్వరలో ప్రతి మహిళకు రూ.2500 అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, ఎంపీడీఓ తిరుమల, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



బాల్క సుమన్ అవినీతి బయటకు తీస్తాం

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు

నవతెలంగాణ - హాజీపూర్

బాల్క సుమన్ అవినీతిని బయటకు తీస్తామని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో బాల్క సుమన్ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మీడియాకు వీడియో సందేశం పంపించారు. బాల్క సుమన్ అవినీతి, అక్రమాలు రేపటి నుండి తోడే ప్రయత్నం చేస్తామన్నారు. స్థాయిని మర్చి సీఎంపైనే వ్యాఖ్యలు చేయడంపై మండిపడ్డారు. పలు సందర్భాల్లో సుమన్‌పై వచ్చిన రాసలీలల బాగోతాలు ప్రజల ముందు ఉంచుతామని పేర్కొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీ అక్రమాలపై విజిలెన్స్ విచారణ

- ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్
- మూడు గంటల పాటు ట్రిపుల్ ఐటీలో పరిశీలన

నవతెలంగాణ-భైంసా

బాసర ట్రిపుల్ ఐటీ అక్రమాలపై త్వరలో విజిలెన్స్ ఎంక్వయిరీ చేయిస్తానని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. సోమవారం బాసర ట్రిపుల్ ఐటీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల హాస్టళ్లను పరిశీలించారు. మరుగుదొడ్లు, విద్యార్థులు ఉండే గదులు శుభ్రంగా లేకపోవడంతో ఎమ్మెల్యే పటేల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మెస్ నిర్వాహకులు సరియైన భోజనం అందిస్తున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం నిబంధనల ప్రకారం అందించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గంలో విద్యా వైద్యం ఇరిగేషన్ రంగాలపై ప్రధాన దృష్టి సారించినట్లు వెల్లడించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తన ధ్యేయమని, అందులో భాగంగానే ట్రిపుల్ ఐటీని ఆకస్మికంగా తనిఖీ చేశానని తెలిపారు. విద్యార్థులు ధైర్యంగా ఉండాలని, త్వరలో అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. ఇష్టపడి చదివి భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని, డ్రగ్స్‌కు అలవాటు పడొద్దని సూచించారు. మూడు గంటల పాటు ఆయన ట్రిపుల్ ఐటీలో తిరిగారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట బాసర మండల నాయకులు సామల రమేష్, విశ్వనాథ్, బిద్దు రమేష్, సాయినాథ్, వెంకట్రావు పటేల్ ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-బోథ్

రాష్ట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తుల శ్రీనివాస్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో ఉండి ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మీద పదేపదే నోరు పారేసుకోవడం సరికాదన్నారు. దమ్ముంటే ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని తెలిపారు. రుణమాఫీ ఎప్పుడు చేస్తారో ప్రజలకు చెప్పాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడిచినా రైతుల ఖాతాలో రైతుబంధు ఇంకా జమ కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ అధ్యాపక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తెలంగాణ ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపక సంఘ(టీజీపీఎల్ఏ) 2024 క్యాలెండర్‌ను సోమవారం ప్రిన్సిపాల్ పి.భరద్వాజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కేంద్ర కమిటీ అధ్యక్షులు ఉమాశంకర్, జనరల్ సెక్రెటరీ అస్మతుల్లాఖాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామేశ్వర్‌రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు రాజేశ్వర్, ఉపాధ్యక్షులు గజానంద్‌రావుకు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంఘ సభ్యులు, విభాగాధిపతులు, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

నవతెలంగా- ఆసిఫాబాద్

వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవి రమేష్ తీర్పు ఇచ్చారు. కాగజ్‌నగర్ టౌన్ సీఐ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం..2020లో కాగజ్‌నగర్ సర్దార్ బస్తీకికి చెందిన జాడి జశ్వంత్‌పై అదే బస్తీకి చెందిన బావండ్లపల్లి ప్రవీణ్‌కుమార్ హత్య చేసిన నేరంపై కేసు నమోదైంది. కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా హత్య నేరం రుజువు కావడంతో నేరస్తుడు ప్రవీణ్ కుమార్‌కు జీవిత కాలం జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

నాగోబా జాతర ఏర్పాట్లపై నేడు కలెక్టర్ సమీక్ష

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని కేస్లాపూర్ జాతర ఏర్పాట్లపై మంగళవారం కలెక్టర్ రాహుల్‌రాజ నాగోబా దర్బార్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని ఐటీడీఏ పీఓ సీసీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ ఖుష్బూ గుప్త హాజరవుతారని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలతో ఉదయం 11గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

ఆరోగ్యమే మహా సంపద



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మానవులకు ఆస్తిపాస్తుల కంటే సంపూర్ణ ఆరోగ్యాన్ని మించిన సంపదలేదని, ఆరోగ్యమే మహా సంపద అని యోగా గురువు దాసరి వినోద్‌గౌడ్ అన్నారు. ఆదివారం బెల్లంపల్లిలో జాతీయ యోగా పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో పట్టణంలోని సెయింట్ క్లారెట్ పాఠశాల విద్యార్థులు ప్రతిభకనబర్చారు. జూనియర్ మహిళా విభాగంలో సోనియాబిశ్వాస్ ప్రథమ, లక్ష్మీప్రసన్న ద్వితీయ, సీనియర్ మహిళా విభాగంలో అంకిత ప్రథమ, నిత్య ద్వితీయ స్థానాలు సాధించారు. సోమవారం వీరిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో జ్ఞాన సంపద, యోగాతో సంపూర్ణ ఆరోగ్య సంపద సమకూరుతుందని తెలిపారు. ప్రాథమిక విద్యాభ్యాస దశ నుంచే యోగా చేయడం ఎంతో ప్రయోజనమని చెప్పారు. ఆయన వెంట మల్లికార్జున్ ఉన్నారు.

గావ్ చలో..బస్తీ చలో ముమ్మరంగా చేపట్టాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధి పనులపై బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన గావ్ చలో..బస్తీ చలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, బీజేపీ మండల అధ్యక్షులు అరెల్లి రాజలింగం పేర్కొన్నారు. సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో మండల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం నరేంద్ర మోడీ నాయకత్వంలో పది సంవత్సరాల నుంచి చేసిన వివిధ అభివృద్ధి పనులపై ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రతి బూత్, గ్రామ గ్రామాన ముమ్మరంగా ప్రచారం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కన్వీనర్ క్రాంతికుమార్, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, అంకం మహేందర్ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు పేర్లు మార్పు చేసుకోవచ్చు

నవతెలంగాణ-నార్నూర్

నార్నూర్, గాదిగూడ మండలంలోని ఎస్‌సీ, ఎస్‌టీ విద్యుత్ వినియోగదారులు తాత, తండ్రి, తల్లి పేరు మీదున్న విద్యుత్ మీటర్లను తమ పేరు మీద మార్చుకోవచ్చని ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఆబ్జెక్షన్ సర్టిఫికేట్ జత చేసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 100 యూనిట్ల ప్రభుత్వ సబ్సిడీని వినియోగదారులు పొందొచ్చని పేర్కొన్నారు.

రిమ్స్ డైరెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నుమొల్ల కిరణ్ అన్నారు. సోమవారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక రైతు వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా జాయింట్ ప్లాట్ ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్, కార్మిక సంఘాలు, వివిధ రంగాల ఉద్యోగ సంఘాలు, అఖిలభారత ఫెడరేషన్లు సంయుక్త కిసాన్ మోర్చా, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 16న దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్ చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలోని వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు, కార్మికులు కూడా సమ్మెలో భాగస్వాములు కావాలని కోరారు. పారిశ్రామిక వివాదాల చట్టం 1947సెక్షన్ -22, సబ్ సెక్షన్ అనుసరించి సమ్మె నోటీసు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, జిల్లా కమిటీ సభ్యులు పి.పొచ్చన్న, ఆర్.సురేందర్, నాయకులు నరేష్, ఇమ్రాన్ అలీ, దశాంత్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : తమ డిమాండ్లు పరిష్కరించాలని, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని సివిల్ సప్లై కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులు ఏఐటియుసి ఆధ్వర్యంలో సివిల్ సప్లై డిఎం నరసింహ స్వామికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ కార్మికులను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని మండిపడ్డారు. ఫిబ్రవరి16న జరిగే దేశ వ్యాపిత సమ్మెను జయప్రదం చేయాలని, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను విడదీసి కార్పొరేట్లకు అనుకూలంగా 4కోడ్‌లు తయారు చేశారని పేర్కొన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, ఇతర డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జరిగే దేశవ్యాప్త సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు దివాకర్, సివిల్ సప్లై హమాలి వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్టుపల్లి సుధాకర్, నాయకులు మేకల శ్రీనివాస్, నారాయణ, పోల్ రాజు, రాజన్న, దత్తు, జుగాదిరావు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్ : ఈ నెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో రైల్వే క్యాజువల్, కాంట్రాక్ట్, ఆల్ హమాలి వర్కర్స్ పాల్గొంటారని సోమవారం కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ మాస్టర్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కైలాష్‌కు తెలంగాణ రైల్వే వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ సామాన్య ప్రజల కార్మిక కర్షక హక్కులపై దాడి చేస్తోందన్నారు. దేశానికి ఆర్థిక వనరులను సమకూర్చే ప్రభుత్వ రంగ సంస్థలను పెట్టుబడిదారులకు కారు చౌకగా అమ్ముతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఉపయోగపడే స్కీములను ప్రైవేటీకరణ చేస్తోందని, కార్మిక వర్గం ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కట్టు బానిసలుగా మార్చి సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కును కాలరాస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో రైల్వే కార్మికుడు యూసుఫ్ పాల్గొన్నారు.



రిమ్స్ డైరెక్టర్‌కు సమ్మె నోటీస్ అందజేస్తున్న సీఐటీయూ నాయకులు



ఆసిఫాబాద్ :



కాగజ్‌నగర్ రూరల్ :

పోలీస్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పోలీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన పోలీస్ క్యాలెండర్‌ను సోమవారం ఎస్పీ గౌస్ ఆలం ఆవిష్కరించారు. ప్రతి ఏటా జిల్లా పోలీసులకు క్యాలెండర్ అందించే సంప్రదాయం పోలీస్ శాఖలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉత్సాహంతో ప్రజలకు మరింత చేరువై విధులు నిర్వర్తించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పోలీసు దర్యాప్తులో మరింత సాంకేతిక పరిజ్ఞానం జోడించి నిందితులకు కఠిన శిక్షలు పడే విధంగా గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ఒక ప్రణాళిక ప్రకారం అధికారుల పర్యవేక్షణలో కొనసాగాలని సూచించారు. ప్రజలకు నిస్వార్థమైన సేవలు అందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. శాంతి భద్రతలను పరిరక్షించే క్రమంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతలు అదుపులో ఉంటేనే నేరాలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పీ సిహెచ్ శ్రీనివాస్ జీ, రిజర్వ్ ఇన్స్పెక్టర్ టీ మురళి, ఏవో భక్త ప్రహల్లాద, అసోసియేషన్ అధ్యక్షుడు పెంచల వెంకటేశ్వర్లు, అసోసియేషన్ సభ్యులు గిన్నెల సత్యనారాయణ, చిందం దేవిదాస్ పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణ కేంద్రాలను యువత సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వివిధ సంస్థల ఆధ్వర్యంలో జిల్లాలో ఏర్పాటు చేస్తున్న నైపుణ్య శిక్షణ కేంద్రాలను యువత సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రవికృష్ణ అన్నారు. రాష్ట్ర ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ప్రొడక్టివిటీ కౌన్సిల్ వారిచే ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు జిల్లా కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నైపుణ్యశిక్షణ వర్క్‌షాప్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని యువత అంది వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సీ ఎస్టీ యువత కోసం నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల ద్వారా నైపుణ్యత పెంచుకోవాలని సూచించారు. ఏపీపీసీ కో ఆర్డినెటర్ సత్యం, శిక్షణ నిర్వాహకులు ఎండి.యాసిన్, సాయి కుమార్, అధికారులు, యువకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు బోల్తా : పలువురికి గాయాలు



నవతెలంగాణ-తలమడుగు

చర్లపల్లి-ఝరి గ్రామాల మూలమలుపు వద్ద సోమవారం ఆర్టీసీ బస్సు బోల్తా పడిన సంఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఆదిలాబాద్ నుండి మధ్యాహ్నం సమయంలో ఐదుగురు ప్రయాణికులతో బస్సు ఝరిపూనగూడకు వెళ్తోంది. చర్లపల్లి మూల మలుపు వద్ద డ్రైవర్ అతివేగంతో తిప్పడంతో ప్రమాదం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రమాదంలో ఝరి గ్రామానికి చెందిన ప్రయాణికుడు పెందూరు శంకర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ అజయ్‌కి నడుము భాగంలో దెబ్బలు తగిలాయి. కండక్టర్ శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి ఎఎస్ఐ సురేందర్ చేరుకొని గాయపడిన వారిని 108లో రిమ్స్‌కు తరలించారు. విషయాన్ని తెలుసుకున్న జెడ్పిటిసి గోక గణేశ్‌రెడ్డి రిమ్స్‌కు వెళ్లి బాధితులను పరామర్శించారు.

సీనియర్ మేట్ల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్: జిల్లాలో ఉపాధి హామీలో పనిచేస్తున్న సీనియర్ మేట్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్, అదనపు కలెక్టర్ దీపక్ తివారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ మేట్లకు వంద రోజులు కాకుండా 365 రోజులుగా గుర్తించాలన్నారు. ప్రతిరోజు 272 చెల్లించాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లతో సమానంగా పని చేస్తున్నామని, వారు లేని చోట సీనియర్ మేట్లకు ఆ విధులు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గం రేణుక, సందీప్, రొడ్డ శంకర్, రాజ్‌కుమార్, శ్రీరామ్, నరేష్, ఆకాష్, చందు పాల్గొన్నారు.

సంతాప సభలో పార్లమెంట్ కోఆర్డినేటర్ నరేష్ జాదవ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ పీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రి పొద్దుటూరి నర్సారెడ్డి సంతాప సభలో ఏఐసీసీ సభ్యులు, ఆదిలాబాద్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ నరేష్ జాదవ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సంతాప సభలో మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు, మాజీ మంత్రి జానారెడ్డి, మాజీ పీసీసీ అధ్యక్షులు వి.హనుమంత్‌రావు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు కోదండరెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో నరేష్ జాదవ్‌తో పాటు నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, జడ్పిటిసి పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, నిర్మల్ జిల్లా సీనియర్ నాయకులు మల్లారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, నర్సారెడ్డిరెడ్డి కుటుంబ సభ్యులు, నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్యనగర్‌ను రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-బోథ్

మండలంలోని సాకేర గ్రామపంచాయతీ పరిధిలోగల సూర్యనగర్ గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలని సోమవారం డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామం 1960లో ఏర్పడిందన్నారు. రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | ఫిబ్రవరి 06, 2024 | www.navatelangana.com

త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

త్రీపేజ్ విద్యుత్ సరఫరా చేయాలని మండలంలోని కొత్తగూడెం(జి) రైతు వెడ్మ అర్జున్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత రెండు సంవత్సరాల కింద చేనులో ఐటీడీఏ ద్వారా బోరు మంజూరు చేసిందని అన్నారు. బోరు వేయించినప్పటికీ త్రీ ఫేజ్ విద్యుత్ వైర్లు లేని కారణంగా రెండో పంటను తీయలేకపోతున్నామని అన్నారు. ఐటీడీఏ చుట్టూ ఎన్ని సార్లు తిరిగిన పట్టించుకునే వారే లేరని విన్నవించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్రీఫేజ్ విద్యుత్ లైన్ వేయాలని కోరారు. ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ దర్బార్‌లో ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్, మేనేజర్ రాంబాబు, ఈఈ భీంరావ్ బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, అధికారులు ఉన్నారు.

కడెం జలాశయంలో మృతదేహం లభ్యం

నవతెలంగాణ-కడెం

మధ్యప్రదేశ్‌కు చెందిన దేవేంద్ర గౌతం(30) మృతదేహం కడెం జలాశయంలో సోమవారం లభ్యమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని కడెం ప్రాజెక్టు వద్ద డ్రిల్లు పనులు వచ్చాడు. ఈ క్రమంలో జనవరి 31నుంచి ఆయన అదృశ్యమయ్యాడు. దేవేంద్ర బంధువులు రెండు రోజులు పాటు చూసి, ఫిబ్రవరి 2న కడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేస్తుండగా సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు దేవేంద్ర మీతదేహం కడెం జలాశయంలో తేలడంతో గమనించిన స్థానికులు పోలీసులకు తెలిపారు. ఘటన స్థలానికి ఖానాపూర్ సీఐ మోహన్, కడెం ఇన్‌చార్జ్ ఎస్సై ప్రభాకర్‌రెడ్డి పోలీసులు దేవేంద్ర మృతదేహన్ని పరిశీలించి, మృతికి గల కారణాలను విచారణ చేసి తెలియజేస్తామని తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సరికావు



నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నట్టు చూపించుకోవడం వారి అసమర్థ పాలనకు నిదర్శనమని బీఆర్ఎస్ నాయకులు కొడప సోనేరావు అన్నారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఇంద్రవెల్లి సభలో సీఎం రేవంత్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. గత బీఆర్.ఎస్ ప్రభుత్వ హయంలో మంజూరైన నిధులకు సంబంధించిన జీఓ ప్రతులను చూపుతూ, సీఎం తీరుపై ధ్వజమెత్తారు. నాగోబా ఆలయ అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిది కోట్లకుపైగా నిధులు కేటాయించిందని అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఎటువంటి అభివృద్ధి జరగడం లేదని వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి సంబంధం లేని వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ఇంద్రవెల్లి సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాగోబా ఆలయ అభివద్ధితో పాటు మారుమూల ఆదివాసీ, గిరిజన గ్రామాల అభ్యున్నతికి కోట్లాది రూపాయల నిధులు విడుదల అయ్యాయని స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానేసి, ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో పరమేశ్వర్, గేడం రాము, గంగయ్య మహమ్మద్, రాజు, కొడప రాజు, కుమ్ర రాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చునార్కర్ రమేష్ కుమార్తె ఇటీవల మరణించారు. సోమవారం విషయం తెలుసుకున్న మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అదేవిధంగా తల్లిని కోల్పోయిన పిల్లలకు ఉజ్వల భవిష్యత్తుకు పునాది కల్పించే బాధ్యతను తీసుకున్నారు. చిన్నారుల అవసరాల కోసం ఆర్థిక సాయంగా రూ.5వేల నగదును అందించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన చిన్నయ్య తండ్రి ప్రమాదవశాత్తు గాయం కావడంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు వెళ్లి బాధితుడిని పరామర్శించి, రూ.4వేలను ఆర్థిక సాయంగా అందించారు. వారి వెంట ఫ్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావ్, నాయకులు మహేందర్ ఉన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

నవతెలంగాణ-తలమడుగు

రైలు ఢీకొని వృద్ధుడి మృతి చెందిన సంఘటన మండలంలోని డోర్లి రైల్వే గేటు వద్ద సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భీంపూర్ మండలం పిప్పలకోటి గ్రామానికి చెందిన కదిరి ఆశన్న(70) సోమవారం రైలు ఇంజన్ ఢీకొని మృతి చెందాడు. మృతుడు కదిరి ఆశన్న సోమవారం మధ్యాహ్నం మండల కేంద్రంలో బస్సు దిగి నడుచుకుంటూ ఝరి గ్రామంలోని కూతురు వద్దకు వెళుతుండగా ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు వెళుతున్న రైలు ఇంజన్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికైన 356 మంది అభ్యర్థులకు పట్టణంలోని రిమ్స్‌లో ఆరోగ్య పరీక్షలు సోమవారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ప్రారంభించారు. ఇటీవల పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికైన వారికి ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలు లేవని రిమ్స్ మెడికల్ బోర్డు ధ్రువీకరణ చేయాల్సి ఉంది. ఆరోగ్య సమస్యలు ఏమీ లేవని ధ్రువీకరణ పత్రం పొందిన వారు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్పీ కార్యాలయంలో రిపోర్టు చేసి ఉద్యోగాల్లో చేరాల్సి ఉంటుంది. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్ ఉన్నారు.

ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదిలాబాద్ జిల్లాలో షెడ్యూల్ తెగల సంక్షేమ కోసం పనిచేస్తున్న ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంద సంస్థలవారు గ్రాంట్ ఇన్ ఎయిడ్ 2024-25 సంవత్సరం మంజూరు కొరకు ప్రతిపాధనలు ఆన్ లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకొనుటకు పోర్టల్‌లో అవకాశం కల్పించామని, ఆసక్తి గల సంస్థల వారు నమోదు చేసుకోవాలని ఉప సంచాలకులు గిరిజన సంక్షేమ శాఖ అధికారి దిలీప్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైలు గుర్తుపై పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తాం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి వైఖరిని మార్చుకుంటూ రైల్వేలైన్‌కు సహకారం అందించాలని రైల్వేలైన్ సాధన సమితి చైర్మెన్ నారాయణ అన్నారు. లేని పక్షంలో ఇదే రైలు గుర్తుపై రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టి పోటీ చేస్తామన్నారు. సోమవారం సెంట్రల్ గార్డెన్‌లో ప్రజాసంఘాల సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పలు విషయాలపై చర్చించి తీర్మాణాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎంపీగా గెలిచిన నాయకులు తమ సొంతానికి ఇండ్లు, కొడుకుల పెండ్లిళ్లు చేశారని ఆరోపించారు. కానీ తాము ఆదిలాబాద్ అభివృద్ధికి ఎంతో కీలకమైన రైల్వేలైన్ కోసం పోరడుతున్నామన్నారు.

ప్రజాప్రతినిధులు ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలన్నారు. లేని పక్షంలో వచ్చే పార్లమెంట్‌లో ఎన్నికల్లో రైలు గుర్తుపై పోటీ చేసి వచ్చిన ఓట్లను ప్రజల అభిప్రాయాలుగా పరిగణిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బండి దత్త్రాతి, దేవన్న, దేవేందర్, నరేందర్, రఫీక్, అశోక్, వెంకన్న పాల్గొన్నారు.

ANNOUNCEMENT
NAME CHANGE

I ADDELA RAKESH S/o. ADDELA CHINNA NARSAIAH. R/O. H.No. 30-130, Street: SRI-RAM GAR, VILLAGE & MANDAL KHANAPUR, DIST NIRMAL TS. Has Declare that CHANGE MY SURNAME "ADDELA" TO "ARDELA" My name Mentioned in Passport BEARING NO. G4278790, "ADDELA RAKESH" Hence forth Hereafter I would be Known As ARDELA RAKESH S/o. ARDELA CHINNA NARSAIAH

బహిరంగ వేలము ప్రకటన
ఈ క్రింద పొందిన జప్తు చేయబడిన వాహనములు వేలంలో అమ్మబడును
Auction Date 07-02-2024, Auction Place: ARGUL VILLAGE, JAKARAN PALLY MANDAL, NIZAMABAD.

S.No.	Vehicle Reg. No.	Year	Make & Model
1.	TS05EA-7623	2014	JOHN DEERE 5055 HARVESTER
2.	TS08UD-6437	2017	TATA ACE MEGA XL

SHRIRAM FINANCE LIMITED
A WINNING RELATIONSHIP
BRANCH ADDRESS
SHRIRAM FINANCE LIMITED
H.NO. 1-2-21/KL6/2, SHIVAJI CHOWK,Bhainsa Road
Nirmal Ph: 08734-240157 / 158

అర్హులైన వారికి పీఎం విశ్వకర్మ యోజన పథకం రుణాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద అర్హులైన వారిని ఎంపిక చేసి రుణాలను అందజేస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం ఏర్పాటు చేసిన సమావేశంలో పరిశ్రమల శాఖపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధికల్పన కొరకు సబ్సిడీ రుణాలను అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేసి మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పథకంపై విస్తృత అవగాహన కల్పించాలని, నిరుద్యోగులు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ పథకం కింద వడ్రంగులు, పడవల తయారీదారులు, ఆయుధ, కవచ తయారీదారులు, కమ్మరులు, సుత్తి, ఇంకా పరికరాల తయారీదారులు, తాళాల తయారీదారులు, బంగారం పనిని చేసే వారు, కుమ్మరులు, శిల్పులు, రాళ్లను పగులగొట్టే వృత్తిలో ఉండే వారు, చర్మకారులు, పాదరక్షల తయారీ దారులు, తాపీ పనివారు, గంపలు, చాపలు, చీపురులను తయారు చేసేవారు, కొబ్బరి నారతో తయారు అయ్యే వస్తువులను చేసే వారు, నాయీ వృత్తిదారులు, మాలలు అల్లే వారు, రజకులు, దర్జీలు, చేపలను పట్టేందుకు ఉపయోగించే వలలను తయారు చేసేవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్, రేషన్ కార్డు, సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సీఎస్సీ సెంటర్స్, గ్రామ, వార్డు సచివాలయాల్లో కూడా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని ఎంపిక చేసి శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. మొదటి విడతలో లక్ష రూపాయలు ఋణం మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్ణిత సమయంలో చెల్లించిన వారికీ తిరిగి రూ.2 లక్షల ఋణం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.అంతకు ముందు ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. ప్రజావాణిలో భాగంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి ఆయన దరఖాస్తులను స్వీకరించారు. ధరణి, ఆసరా, డబుల్ బెడ్ రూం ఇండ్లు, తదితర సమస్యలపై వచ్చిన దరఖాస్తులను స్వీకరించి పరిష్కరానికి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. దరఖాస్తుదారులకు రాత పూర్వకంగా సమాచారం అందించాలని సూచించారు. ఈ ప్రజావాణిలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు, మైనారిటీ సంక్షేమ అధికారి రాథోడ్ రమేష్, మున్సిపల్ కమీషనర్ శైలజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల భవనం మంజూరు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పట్టణంలోని మున్సిపల్ 12వ వార్డ్ న్యూహౌసింగ్ బోర్డ్ పరిధిలో 170 ఆదిత్య నగర్ కాలని ఏర్పడి సుమారు 10 సంవత్సరాలు కావస్తుందని కానీ ఇప్పటి వరకు పాఠశాల లేదని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి అన్నారు. ఈ విషయమై సోమవారం ప్రజావాణిలో యువజన కాంగ్రెస్ నాయకులు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ 5వేల మంది జనాభా నివసిస్తున్నారని అన్నారు. ఇందులో నివాసముండే నిరుపేద పిల్లలకు ప్రభుత్వ పాఠశాల మాత్రం లేదన్నారు. ప్రస్తుతం ఓ భవనం అద్దెకి తీసుకొని అందులో ఇద్దరు ఉపాధ్యాయులు ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు విద్యను బోధిస్తున్నారని అన్నారు. గత ఐదేండ్ల కింద అప్పటి డీఈఓ రవీందర్ రెడ్డి పాఠశాల భవన ఏర్పాటుకు 170 కాలనీలో ప్రభుత్వ స్థలం గుర్తించడం జరిగిందన్నారు. కానీ అక్కడ పాఠశాల భవన నిర్మాణం చేపట్టకపోవడంతో ఓ అద్దె భవనంలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేసుకొని విద్యను బోధించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పటికైనా స్థానికంగా ఉన్నటువంటి విద్యార్థుల తల్లిదండ్రుల పరిస్థితులను అర్థం చేసుకొని ఆ పాఠశాల పక్కా భవనాన్ని పూర్తిచేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రం అందించామని అన్నారు. అక్కడ పాఠశాల భవనం నిర్మించకపోతే ఆ స్థలం కబ్జాకు గురయ్యే అవకాశం ఉందన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి, పాఠశాల భవన నిర్మాణం చేపట్టాలన్నారు. పేద పిల్లలకు విద్యను అందించాలని లక్ష్యంతో ముందుకు వచ్చి, అద్దె చెల్లిస్తూ విద్యను అందిస్తున్న ఉపాధ్యాయురాలికి ఇబ్బంది కాకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, మావల మండల అధ్యక్షుడు శేఖర్, ఉపసర్పంచ్ మల్లయ్య, రంజిత్ రెడ్డి ఉన్నారు.

పోకిరీల పట్ల జాగ్రత్తగా ఉండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పోకిరిల పట్ల జాగ్రత్తగా ఉండాలని షీటీం బృందం సభ్యులు బి.సుశీల అన్నారు. సోమవారం పట్టణంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాల గజిటెడ్ నెంబర్ 2 పాఠశాలల్లో షీటీం బృందం సభ్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం సభ్యులు విద్యార్థులతో మాట్లాడుతూ అమ్మాయిలకు ఎవరైనా పోకిరిలు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ చేసినా, అమ్మాయిలను ఏడిపించినా, వెంటపడి వేదించిన, ప్రేమాపెళ్లి అంటూ వెంటపడిన, అదేవిధంగా ఫోన్‌లో చాటింగ్, వాట్సాప్ ఫేస్‌బుక్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయాలు పెంచుకోవద్దని అన్నారు. వాటి ద్వారా మోసపోయే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇటువంటి నేరాలు జరిగిన వెంటనే షీటీం నెంబర్ 8712659953కి కాల్ చేయాలని, సైబర్ నేరాలు జరుగుతే వెంటనే 1930 కి కాల్ చేయాలని సూచించారు. పట్టణానికి అవతల ఉన్న పిల్లలకు, నడుచుకుంటూ వచ్చే పిల్లలకు ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు వెంటనే 100కి కాల్ చేయాలని తెలిపారు. మైనర్ అమ్మాయిలపై అఘాయిత్యాలు జరుగుతే, పోక్సో యాక్ట్ కింద చర్యలు తప్పవన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు.

యాంటీ డ్రగ్స్, అండ్ యాంటీ ర్యాగింగ్ గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. ఒకసారి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయితే మళ్లీ ఎప్పటికీ గవర్నమెంట్ జాబ్ రాదని వివరించారు. ఎవరైతే షీటీంకి ఫిర్యాదు చేస్తారో, వారి పేరు వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, షీటీం బృందం సభ్యులు జి.సత్య, మోహన్ పాల్గొన్నారు.

- పాఠశాలలో షీటీం బృందం అవగాహనా సదస్సు



రోడ్డు పనులకు భూమిపూజ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని భీంసరి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ చట్టం కింద మంజూరైన రోడ్లకు సోమవారం ఎమ్మెల్యే పాయల శంకర్ గ్రామస్తులు, మాజీ సర్పంచ్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామాలకు గ్రామపంచాయతీల కొరకు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. గత ప్రభుత్వం నిధులు మంజూరైన వాటిని దారిమళ్లించి గ్రామాలాభివృద్ధికి అడ్డుకట్ట వేసిందన్నారు. గ్రామాల్లో జరగాల్సిన కార్యక్రమాలన్ని మూలనపడ్డాయని అన్నారు. కనీసం గ్రామపంచాయతీ కార్మికులకు కూడా వేతనాలు ఇవ్వలేని దుస్థితికి గత ప్రభుత్వం పంచాయతీ తీసుకొచ్చిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల కోసం ప్రవేశపెట్టిన అన్ని పథకాలను చివరి వ్యక్తి వరకు అందించే బాధ్యత నాది అని అన్నారు. ఎన్నికల వరకే పార్టీల మధ్యన అధికారుల మధ్యన విభేదాలు కానీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత నేను ప్రజల మనిషిని పార్టీలకతీతంగా పని చేస్తానని అన్నారు. అధికారులు కూడా వెంటనే స్పందించి మంజూరైన పనులకు నిధులు సమకూర్చి పనులను ప్రారంభించాలని కోరారు. నాయకులకు అధికారులకు మధ్యన సమన్వయం ఉంటేనే అభివృద్ధి త్వరితగతిన పూర్తవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మయూర్ చంద్ర, గ్రామ ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బదిలీలు, ప్రమోషన్లు వెంటనే చేపట్టాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్



నవతెలంగాణ-లక్ష్మణచాంద

రాష్ట్ర వ్యాప్తంగా బదిలీలు, ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలో కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగులకు 3డీఏల అమలు, పీఆర్సీ, సీపీఎస్ రద్దు, కేజీబీవీ సిబ్బందికి మినిమమ్ టైం స్కేల్ అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దాసరి శంకర్, మండల అధ్యక్షులు గోవర్ధన్, జిల్లాప్రధాన కార్యదర్శి పెంట అశోక్, మండల కార్యదర్శి బలరాం, వేణు, రాందాస్ పాల్గొన్నారు.

సర్పంచులకు గ్రామస్తుల సన్మానం

నవతెలంగాణ-బేల

మండలంలోని డోప్టాల గ్రామసర్పంచ్‌గా గత ఐదు సంవత్సరాల నుంచి ప్రజలలో ఉంటూ వారి కష్ట సుఖాలలో వారి మధ్యన ఉండి సేవలు అందించారు. సోమవారం గ్రామస్తులు సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బోడకుంట రాకేష్ మాట్లాడుతూ తన ఐదు సంవత్సరా పదవీ కాలంలో గ్రామంలో ప్రజల అందరికీ అందుబాటులో ఉండి సేవలను అందించడం జరిగిందని అన్నారు. తన పదవీకాలంలో ఎవరినైనా, ఏ విషయంలో నైనా భాధ కలిగి ఉంటే తన విధి నిర్వహన తప్ప మరోలా భావించవద్దని అన్నారు. తన పదవికి మాత్రమే విరమణ అని, గ్రామస్తులకు ఎప్పటికీ అందుబాటులో ఉండి తన వంతు సేవలను అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వైద్య కిషన్‌రావ్, రామెల్లి మోరేశ్వర్, ఠాక్రె నానాజీ, విజయ్ పూజారి, యూత్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి జోగు ప్రణయ్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దినసరి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

దినసరి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని దినసరి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాథోడ్ బాపూరావు, ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ఎ.రాజన్న అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలోని గత 30సంవత్సరాల నుంచి ఆశ్రమ, గురుకుల పాఠశాల వసతి గృహల్లో దినసరి ఉద్యోలుగా పని చేస్తున్నామని అన్నారు. 136 మంది వర్కర్లు, ఐటీడీఏలో పని చేస్తున్న 18 మంది వర్కర్, డ్రైవర్లకు గత ప్రభుత్వం రెగ్యులర్ చేసి, టైమ్ స్కేల్‌ను అందిస్తామని అన్నారు. కానీ ఇప్పటిదాకా రెగ్యులర్‌గా చేయలేదని అన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న దినసరి ఉద్యోగులకు ఆరు నెలల నుంచి వేతనాలు చెల్లించక పోవడంతో కటుంబాలను పోషించడం భారంగా మారిందని అన్నారు. ఐటీడీఏ అధికారులు వెంటనే స్పందించి వేతనాలను విడుదల చేయాలనీ, అలాగే 250 మంది దినసరి ఉద్యోగులు పదవీవిరమణ చేశారు. వారి స్థానంలో వేరే వాళ్లను భర్తీ చేయాలని కోరారు.

మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్‌లపై నెగ్గిన అవిశ్వాసం

నవతెలంగాణ-ఖానాపూర్

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన మున్సిపల్ అవిశ్వాస తీర్మానం సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించగా, ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్, వైస్ చైర్మెన్ అబ్దుల్ ఖలీంలపై అవిశ్వాసం నెగ్గింది. ఖానాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజురా సత్యం ఆధ్వర్యంలో 9 మంది కౌన్సిలర్‌లు కలిసి ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాణ ప్రక్రియలో భాగంగా చైర్మెన్, వైస్ చైర్మెన్‌లను చేతులెత్తే పద్ధతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా అవిశ్వాసానికి మద్దతు పలికిన 9 మంది కౌన్సిలర్‌లు వారికి వ్యతిరేకంగా ఓటు వేసి పదవిచ్యుతులు చేశారు. అనంతరం కౌన్సిలర్‌లు, నాయకులు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రజురా సత్యంకు పూల మాలలు వేసి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

చేనేత ఐక్యవేదిక నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

తెలంగాణ చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మాజీ మంత్రి జోగు రామన్న ఆవిష్కరించారు. పట్టణంలోని తాలూకా పద్మశాలి సంఘ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం ప్రతినిధులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మాజీ మంత్రి జోగు రామన్నను సంఘం నాయకులు శాలువాలతో సత్కరించారు. అనంతరం వారితో కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ మేరకు మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ చేనేత ఐక్యవేదిక ద్వారా చేపడుతున్న కార్యక్రమాల పట్ల అభినందనలు తెలియజేశారు. సమస్యల పరిష్కారానికి సంఘ బాధ్యులు చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో తాలూకా పద్మశాలి సంఘం అధ్యక్షులు బొమ్మకంటి రమేష్, జిట్ట రమేష్, దాసరి రమేష్, మోర ఆశన్న, నాగన్న, దాసరి ఆశన్న, అనుముల ఊశన్న, గాజుల హన్మండ్లు పాల్గొన్నారు.

మాల సంక్షేమ సంఘం కనుగుట్ట గ్రామ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-బోథ్

మండలంలోని కనుగుట్ట గ్రామంలో సోమవారం బోథ్ మాల సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు ఎలుక రాజు, మండల నాయకుడు బత్తుల ఊశన్న ఆధ్వర్యంలో గ్రామకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొటాడి స్వామి, ఉపాధ్యక్షుడు బోడ చిన్న గంగయ్య, ప్రధాన కార్యదర్శి కొటాడి శంకర్, కోశాధికారి చిటమిల లక్ష్మణ్, కార్యదర్శి కొటాడి గంగాధర్, కార్యవర్గ సభ్యులు కొటాడి సాగర్, బోడ లక్ష్మణ్, దుబ్బ రాముడు, రామకృష్ణ, జువ్వల శివకుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు మాల సంక్షేమ సంఘం అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం మండల ప్రజా ప్రతినిధులకు, మండల సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అమర సైనికుని భార్యకు చెక్కు అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం ఈజ్‌గాం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి సురేష్ మండల్ మరణించారు. ఆయన భార్య తపోసే మండల్‌కు సైనిక సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన రూ.2 లక్షల చెక్కును సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌ఓ విష్ణువర్ధన్, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్‌దాస్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | ఫిబ్రవరి 06, 2024 | www.navatelangana.com

బ్యూటీషియన్ శిక్షణకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో కొనసాగుతున్న జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో స్కీంలో భాగంగా అందించే బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారిణి సావిత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు 45 రోజులు బ్యూటిషన్‌లో శిక్షణ ఇచ్చేందుకు బ్యూటిషన్ కోర్సులో శిక్షణ పొందిన, అనుభవజ్ఞులైన వారు ఈనెల 6 నుండి 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు మహిళా అభ్యర్థులు విద్యార్హత, శిక్షణలో పొందిన ధ్రువపత్రాలతో జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు. వయసు 35 సంవత్సరాలలోపు, స్థానిక మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, 45 రోజులు శిక్షణ పూర్తి అయిన తర్వాత ట్రైనర్‌కి 30,000 వేతనం ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం లేదా 8919415934ను సంప్రదించాలన్నారు.

వార్ధా ప్రాజెక్టు నిర్మాణానికి సహకారం అందించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



వార్ధా ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు కోరారు. సోమవారం కేంద్ర జల శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వార్ధా ప్రాజెక్టు అవసరాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. తూర్పు ఆదిలాబాద్ జిల్లాలోని రెండున్నర లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం సాయం చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రతిపాదనను పంపిస్తే ప్రధాన మంత్రి కిసాన్ సించాయి యోజన కింద తగిన సాయం చేస్తామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు జిల్లా పేరును రాష్ట్ర స్థాయిలో నిలపాలని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ జిల్లా స్థాయి పోటీ పరీక్షలు నిర్వహించారు. దీనికి ఆయన పాల్గొని ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్స్, బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. నిర్వాహకులు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఎంపికైన వారికి జనగామ పట్టణంలో ఈ నెల 9,10, 11 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారిలో తెలుగు మీడియం విభాగంలో జనకాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిఖిత, శంకర్, తిరుపతి ఉండగా ఆంగ్ల మాధ్యమ విభాగంలో స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు పి.రాకేష్, జీ.వర్షిత్, ఎన్. జశ్వంత్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ మధుకర్, పాఠశాల ప్రిన్సిపాల్ ఖలీల్, సెక్టోరియల్ ఆఫీసర్ భరత్, అబిడ్ అలీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్, జిల్లా అధ్యక్షులు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి క్రిష్ణమాచారీ, జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్, రాజేష్, లక్ష్మణ్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఉషన్న పాల్గొన్నారు.

'పల్లెకుపోదాం' కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పల్లెకు పోదాం పదండి (గావ్ చలో అభియాన్) కార్యక్రమాన్ని జిల్లాలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు బూత్ స్థాయి కార్యకర్తలు విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ కోరారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజల శ్రేయస్సుకోసం ఎన్నో పథకాలను అమలు చేశారన్నారు. హిందువుల 50 ఏండ్ల స్వప్నం రామ మందిర నిర్మాణం నెరవేర్చిన ఘనత బీజేపీదే అన్నారు. ఆర్టికల్ 370 ఎత్తివేసి జమ్మూ కాశ్మీర్‌లో శాంతి ప్రగతి స్థాపన చేయడంలో కీలక పాత్ర పోశించిందన్నారు. చంద్రయాన్-2, ఆదిత్య ఎల్ వన్ మంగళాయాన్ లాంటి అంతరిక్ష అద్భుతాలు సృష్టించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షులు చెనకపురి గణపతి, ఈర్ల విశ్వేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి సమీర్ గుప్తా, జిల్లా కోశాధికారి అరుణ్ లోయ, పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ అమిత్ బిశ్వాస్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పారేపల్లి రాణి, కిరణ్ బేటీ, వనపదాసు రమేష్, కృష్ణస్వామి, అశోక్, మధు, అనిల్ పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలపై పోరాడుదాం'



నవతెలంగాణ-బెజ్జూరు

ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటం చేస్తూ ప్రజల్లోనే ఉండి సేవలు చేశానని ఆదివాసీ మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం సుగుణక్క అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కొన్ని సంవత్సరాల నుండి సమస్యలపై పోరాటంలో 56 కేసులు నమోదయ్యాయన్నారు. కాంగ్రెస్ నుండి పార్లమెంటు అభ్యర్థి టికెట్ ఆశిస్తున్నానని, ఒకవేళ పార్టీ గుర్తించి తనకు టికెట్ ఇస్తే పోటీ చేస్తానన్నారు. టికెట్ వస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నెల రోజుల నుండి ఆయా గ్రామాల్లో పర్యటిస్తున్నానని, ప్రజల నుండి మంచి ఆధరణ లభిస్తుందన్నారు. ఆదివాసులు బీసీలు, ఎస్సీలు, మైనార్టీలు అన్ని వర్గాలకు చెందిన ప్రజల నుండి తనకు మద్దతు లభిస్తుందన్నారు. ప్రజల్లో ఉండాలనే ఆశయంతో తాను సేవ చేశానని, ఆదివాసీ బిడ్డకు కాంగ్రెస్ అవకాశమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో ఇప్పటివరకు మహిళా అభ్యర్థిని నిల్పోలేదని, మొదటిసారిగా తాను పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేయడానికి మద్ధతు కోరుతున్నారన్నారు. తనకు ఆశించిన మేర మద్దతు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సాయన్న, ఆదివాసీ నాయకులు సోయం చిన్నయ్య, శంకర్, గాజుల సుగుణక్క, మధూకర్, సాగర్, భాస్కర్, అతిక్ పాల్గొన్నారు.

రేపు ఒప్పంద పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా మొబైల్ మెడికల్ యూనిట్‌లో ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల నియామకానికి బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ తుకారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థుల జాబితా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ నోటీస్ బోర్డు, ఆన్‌లైన్‌లో పెట్టామని తెలిపారు. మెరిట్ జాబితాలో గల అభ్యర్థులు ఈనెల 7న ఉదయం 10 గంటలకు నిజ ధ్రువీకరణ పత్రాలను తీసుకొని జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. వివరాలకు కార్యాలయ నోటీసు బోర్డు, ఆన్‌లైన్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆసిఫాబాద్.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌ను చూడాలన్నారు.

పంచాయతీల అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి

- కలెక్టర్ బొర్కడే హేమంత్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక అధికారులు, పంచాయితీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. సోమవారం ప్రత్యేక అధికారులు, పంచాయితీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచుల పదవీకాలం ముగిసినందున ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 335 గ్రామపంచాయతీలకు 175 మంది మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించామన్నారు. ఈనెల రెండవ తేదీన వీరు బాధ్యతలు స్వీకరించారని తెలిపారు. ఈ నెల 7 నుండి 15వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఇంటికి తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. నూతన పంచాయతీరాజ్ చట్టాలపై ప్రత్యేక అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రజా ప్రతినిధులు లేని లోటు కనపడకుండా పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గ్రామపంచాయతీలలో నిత్యం జరిగే పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించాలని, మురుగు కాలువలను శుభ్రం చేయించాలని, ప్రతి ఇంటి నుండి తడి చెత్త, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించాలని, హరితహారం కింద నాటిన మొక్కలను రక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నర్సరీల నిర్వహణపై దృష్టి సారించాలని, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డుల నిర్వహణ, విద్యుత్ దీపాల ఏర్పాటుపై పర్యవేక్షించాలన్నారు. ప్రతి రెండు నెలలకు జరిగే గ్రామ సభలకు ప్రత్యేక అధికారులు అధ్యక్షత వహించి ఆధాయ వ్యయాలపై సమీక్షించాలని, గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపొందించి గ్రామ సర్పంచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని, 100 శాతం ఇంటి పన్నులు వసూలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మండల కేంద్రాలు, మేజర్ గ్రామపంచాయతీలలో అక్రమ వెంచర్ల ఏర్పాటుపై దృష్టి సారించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా సహాయక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, వీటిలో షాడో పోలింగ్ కేంద్రాలు, నెట్‌వర్క్ అందుబాటులో లేని పోలింగ్ కేంద్రాలు ఉన్నందున ఆ ప్రాంతాలలో నెట్‌వర్క్ సిగ్నల్ వివరాలు సేకరించి సెక్టోరల్ అధికారులకు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, డివిజనల్ పంచాయతీ అధికారి సురేష్, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి)ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం

నవతెలంగాణ - సిర్పూర్(టి)

సిర్పూర్ మండల ఎంపీపీ సున్నారక్ సువర్ణపై ఆరుగురు ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఎంపీటీసీలు తెలిపారు. సోమవారం కాగజ్‌నగర్ ఆర్‌డీఓ సురేష్‌కుమార్‌కు ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేశారు. ఐదు నెలల కాలపరిమితి ఉన్నప్పటికీ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నట్లు, నాలుగేండ్ల పరిపాలన కాలంలో ఎంపీటీసీలకు గౌరవం ఇవ్వకుండా అగౌరవపరుస్తున్నారని, మండల అభివృద్ధి కోసం రాష్ట్రం ప్రభుత్వం నుండి ఏ నిధులు దేనికోసం వస్తున్నాయో తెలపడంలేదన్నారు. ఎంపీటీసీలకు కనీస మర్యాద ఇవ్వకుండా ప్రోటోకాల్ పాటించకుండా నియంతగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనుల విషయం అడిగితే సరైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అవిశ్వాస తీర్మానం పత్రం ఇచ్చిన వారిలో సోహెల్ హైమద్, ఈర్త సత్యనారాయణ, లావుడ్య మంగీలాల్, ఎలుములె సరిత, శైరాబేగం, కారం శైలజ ఉన్నారు.



అవిశ్వాస తీర్మాన పత్రాన్ని ఆర్‌డీఓకు అందజేస్తున్న ఎంపీటీసీలు

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్



కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న సీఐటీయూ నాయకులు, కాంట్రాక్ట్ మున్సిపల్ కార్మికులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసి, కనీస వేతనం రూ.21వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ బోర్కడ హేమంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందికి ఏపీ తరహాలో రూ.21వేలు, రూ.24,500 వేతనం అమలు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో సుమారు 65 వేల మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్-పే తదితర పద్ధతుల్లో ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారన్నారు. వెంటనే కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. గతంలో కాంగ్రెస్ నాయకులు తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వారు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు త్రివేణి, జిల్లా తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శంకర్, నాయకులు సంజీవ్, మల్లేష్, రమేష్ , బాపు, శంకరమ్మ మల్లేష్ పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్

నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండలంలోని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సుజిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలోని వైద్య ఆరోగ్యశాఖలో దాదాపు ఐదు వేల మంది యూపీహెచ్‌సీ ఏఎన్ఎంలు, రెండో ఏఎన్ఎంలు కాంట్రాక్టు బై అవుట్ సోర్సింగ్ ఏఎన్ఎంలుగా పనిచేస్తున్నారన్నారు. 17 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నా సమస్య పరిష్కారం కావడంలేదని, కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన వాటా ప్రకారం నిధులు కేటాయించకపోవడం కారణంగా జీతాలు తక్కువగా వస్తున్నాయన్నారు. ప్రస్తుతం చాలీచాలని జీతాలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు తక్షణమే విడుదల చేయాలని, నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు వారి సంక్షేమానికి తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి రూ.వెయ్యి కోట్లు మంజూరుచేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల



వినతిపత్రం అందజేస్తున్న బోగె ఉపేందర్, రెండో ఏఎన్ఎంలు

16వ తేదీన ఒక్క రోజు నిరవధిక సమ్మెను నిర్వహించాలన్నారు. నోటిఫికేశన్ రద్దు చేసి రెగ్యులర్ చేయాలని, ఒకవేళ పరీక్ష పెట్టాల్సి వస్తే 5600 పోస్టులను మంజూరుచేసి డిపార్టుమెంటులో పరీక్ష ద్వారా వీరిని రెగ్యులర్ చేయాలని, యూపీహెచ్‌సీలో ఒక ఏఎన్ఎం పనిచేస్తున్న చోట రూ.15 వేల అదనపు వేతనం అందించాలని, సంవత్సరానికి రూ.4500 యూనిఫామ్ అలవెన్స్ అందజేయాలని, పర్మినెంట్ ఉద్యోగుల మాదిరిగా రెండవ ఏఎన్ఎంలకు కూడా సెలవులు మంజూరు చేయాలని, ఎవరైన కాంట్రాక్టు ఏఎన్ఎంలు దురదృష్టవశాత్తు మరణిస్తే వారి కుటుంబసభ్యులలో ఒకరికి ఆరు నెలలలోపు కారుణ్య నియామకాల కింద కాంట్రాక్టు బేసిక్‌లో ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు అరికిల్ల స్వామి, సునీత, వనిత, ప్రమీల పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు ఈవీఎంలను సిద్ధం చేయాలి

- కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాబోవు పార్లమెంట్ ఎన్నికలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం) సిద్ధం చేయాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఈవీఎం పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ఈసీఎల్ ఇంజనీర్ల సహాయంతో ప్రతి పరికరాన్ని పనిచేసే విధంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం మార్కెట్ యార్డులోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు జితేందర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోతు రాజు ధర్మరాజు ఆలయానికి పోటెత్తిన గిరిజనం



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని ఇందపూర్ సమీపంలోని పోతురాజు ఆలయం వద్ద సోమవారం జాతర ప్రారంభమైంది. జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన ఆదిమ జాతి గిరిజనులు పోతురాజు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా పోతురాజుకు ఆదిమజాతి గిరిజనులు ప్రత్యేక సంప్రదాయ పూజలు నిర్వహించారు. డోలు వాయిద్యాల నడుమ యువతులు, మహిళలు సంప్రదాయ నృత్యాలు చేశారు. ఎంపీపీ పెందూర్ మోతీరాం, జెడ్పీటీసీ సెడ్మాకి ద్రుపత బాయి కుమురం భీం మనమడు సోనేరావు పోతురాజు ధర్మరాజును దర్శించుకొని పూజలు చేశారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు హాజరైన యువకులను పరిచయం చేసుకున్నారు. అనంతరం కబడ్డీ క్రీడలను ప్రారంభించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వాంకిడి సీఐ శ్రీనివాస్, కెరమెరి ఎస్సై జి. విజయ్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సిడాం ధర్ము, రాజు, భీంరావు పాల్గొన్నారు

యోగాలో కౌటాల విద్యార్థినుల ప్రతిభ



నవతెలంగాణ-కౌటాల

కాక మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో నిర్వహించిన యోగా పోటీల్లో కౌటాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు బంగారు, కాంస్య పతకాలను గెలుచుకున్నారు. ఆరు సంవత్సరాల నుండి పది సంవత్సరాల వయసు గల విద్యార్థులకు నిర్వహించిన యోగా పోటీల్లో మండలకేంద్రానికి చెందిన దాసరి దార్థికకు బంగారు పతకం, కామ్రె జాకిలినికి కాంస్య పతకాలను గెలుపొందారు. జిల్లా యోగా ప్రచారక్ వినోద్‌గౌడ్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్టు, రాబోయే రోజుల్లో విద్యార్థులకు మరింత ఉన్నత పతకాలను అందుకొనేలా తయారుచేస్తానని ఆయన తెలిపారు. బంగారు, కాంస్య పతకాలు గెలుపొందిన విద్యార్థినీలను తల్లిదండ్రులతో పాటు పలువురు అభినందించారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజావాణిలో సమస్యల పరిష్కారం కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను సంబంధిత అధికారులు త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | ఫిబ్రవరి 06, 2024 | www.navatelangana.com

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-జైపూర్



జైపూర్ మండలం రసూల్‌పల్లి వాగు నుండి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. రసూల్‌పల్లి వాగు నుండి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి నిఘా ఏర్పాటు చేసి ట్రాక్టర్‌ను పట్టుకున్నామని మైనింగ్ ఏడీ బాలు తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్‌ను జైపూర్ పోలీస్ స్టేషన్‌లో పెట్టామని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తలసేమియా వ్యాధిగ్రస్తుల ప్రాణాలను కాపాడాలి

నవతెలంగాణ-మందమర్రి



తలసేమియా వ్యాధిగ్రస్తుల ప్రాణాలను కాపాడాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్ కోరారు. సోమవారం మందమర్రి జీఎం కార్యాలయంలో జీఎం మనోహర్‌ని కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో రక్త నిల్వలు తగ్గాయని తలసేమియా వ్యాధిగ్రస్తుల ప్రాణాలను కాపాడాలని కోరారు. జీఎం సానుకూలంగా స్పందించి రెండు రోజుల్లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించి తలసేమియా వ్యాధిగ్రస్తులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

నేటికీ రోడ్డు, నీటి సౌకర్యం కరువు

- ప్రభుత్వాలు మారుతున్నా
- మారని గిరిజనుల బతుకులు
- దారిలేని గూడేలేన్నో..

నవతెలంగాణ-జన్నారం

స్వాతంత్ర్యం వచ్చి ఏండ్లు గడుస్తున్నా నేటికీ గిరిజన గూడేలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. నీటి సౌకర్యం, గ్రామాలకు వెళ్లడానికి దారి లేక నానా అవస్థలు పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుని రాష్ట్రం అభివృద్ధి జరుగుతున్న తరుణంలో ఆదివాసీ గిరిజన గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలోని జన్నారం, దండేపల్లి, కాసిపేట, నెన్నెల మండలాల్లోని గిరిజన, ఆదివాసీ గూడేలు నేటికీ రహదారికి నోచుకోలేదు. ప్రభుత్వాలు, పాలకులు మారినా గిరిజనుల బతుకులు మాత్రం మారడం లేదు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనైనా తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశతో గిరిజనులు ఎదురుచూస్తున్నారు.

గ్రామపంచాయతీగా మారినా..

జన్నారం మండలంలోని లోతొర్రే గ్రామ పంచాయతీగా మారినా, నేటికీ రహదారి లేక ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో వాగు పొంగితే రాకపోకలు నిలిచిపోతాయి. కొత్తపేట గ్రామ పంచాయతీ రాయికుంట గూడెనికి దారి కష్టాలు తప్పడం లేదు. కొత్తపేట, కొలంగూడ మీదుగా చెరువు కట్ట దాటి చేల నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారు. మల్యాల, దొంగపల్లి, అలీనగర్ గ్రామాలకు రోడు, నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను విన్నవించిన పట్టించుకనే వారే కరువయ్యారు.



అల్లీనగర్ రహదారిపై మొలిచిన గడ్డి

దండేపల్లిలో పరిస్థితి..

దండేపల్లి మండలంలోని ఊట్ల గిరిజన గ్రామం మండల కేంద్రం నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆ గ్రామానికి వెళ్లేందుకు బీటీ రోడ్డు మంజూరైనా, అటవీ అనుమతులు లభించని కారణంగా కొంతవరకు బీటీ రోడ్డు వేసి, మిగితా గ్రామం వరకు మెటల్ రోడ్డు వేశారు. ఇదే పరిస్థితి మండలంలోని ఆయా గ్రామాల్లో ఉంది. మెటల్ రోడ్డు ప్రస్తుతం కంకర తేలి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా, ఫలితం లేదని గిరిజనులు వాపోతున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా కావడం లేదని గిరిజనులు వాపోతున్నారు. అయిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఇటువైపు చూడడం లేదు.

నెన్నెల, కాసిపేటలో అదే పరిస్థితి..

నెన్నెల, కాసిపేట మండలాల్లోని గిరిజన గ్రామాల పరిస్థితి కూడా ఇలానే ఉంది. నెన్నెల మండలంలోని పాటి, బోగంపల్లి, దర్మరె డ్డిపేట, కోనంపేట గిరిజన గూడేలున్నాయి. బోగంపల్లి, కోనంపేట గూడేలకు దారి కరువైంది. మిగితా గ్రామాల్లో నీరు, రోడ్డు సమస్యలున్నాయి. కాసిపేట మండలంలో 15 వరకు గిరిజన గూడేలున్నాయి. కొన్ని గూడేల్లో నీటి సమస్య, మరికొన్ని గూడేలకి దారి సమస్య ఉంది. కొత్త కురెగడ్ గిరిజన గ్రామానికి దారి లేక తిప్పలు పడుతున్నారు. ఈ నూనత ప్రభుత్వం అయిన తమ సమస్యలను గుర్తించి పరిష్కరిస్తుందనే ఆశతో గిరి జనం ఉన్నారు.



లోతొర్రె రోడ్డు పరిస్థితి



కంకర తేలి నడవలేని స్థితిలో ఊట్ల రహదారి

రోడ్డు వేయాలి

మోతే రజిత, ఊట్ల



ఏండ్లుగా మా గూడేనికి పోవడానికి రోడ్డు లేదు. ఉన్న రోడ్డు కంకర తేలింది. ఈ రోడ్డుపై రాకపోకలు కష్టంగా మారింది. ఓట్లప్పుడు వచ్చిన నాయకులు రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు మరిచిపోతుండ్రు. మా బాధలు తెలుసుకుని డాంబర్ రోడ్డు వేయాలి.

వంతెన నిర్మించాలి

బహాదుషా, గ్రామ పెద్ద లోతొర్రె



కవ్వాల్ నుంచి సోనాపూర్ తండా మీదుగా లోతొర్రెకు వెళ్లాల్సి వస్తుంది. వాగు ఉండటం వల్ల రాకపోకలకు ఇబ్బంది అవుతోంది. అధికారులు స్పందించి రోడ్డు, వంతెన నిర్మించి కష్టాలు దూరం చేయాలి.

గ్రామీణ క్రీడా కబడ్డీ అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-తాండూర్

గ్రామీణ క్రీడ అయిన కబడ్డీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం నెన్నెల మండలం గొల్లపల్లిలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు తమ్మినేని రాజేష్ నిర్వహించిన కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా యువకులతో కబడ్డీ ఆడి ఉత్సహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందించే విధంగా కృషి చేస్తానన్నారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం. శారీరక దారుఢ్యం కలుగుతుందని తెలిపారు. క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రోత్సాహాన్ని అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడాకారులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తుందని, గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలన్నారు. నియోజకవర్గ క్రీడాకారులు రాష్ట్ర, అంతర్రాష్ట్ర స్థాయిలో రాణించే విధంగా వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్ ప్రత్యేక శిక్షణాలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, గొల్లపల్లి ఎంపీటీసీ బొమ్మన హరీష్ గౌడ్, మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కొమ్ము రాజన్న, సీనియర్ నాయకులు మల్ల గౌడ్, రత్నం ప్రదీప్, యూత్ కాంగ్రెస్ నాయకులు హరీష్ పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న సీసీసీ నస్పూర్‌లో గల కుమార్ గన్నర్స్ స్పోర్ట్స్ అండ్ డిఫెన్స్ అకాడమీ మైదానంలో సబ్ జూనియర్ విభాగంలో బాలబాలికలకు జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు నడిపెల్లి దివాకర్ రావు, కార్యదర్శి రాం చందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడా పోటీలు 16 సంవత్సరాలలోపు బాలబాలికలు అర్హులని వారు పేర్కొన్నారు. ఎంపికైన జట్లు ఫిబ్రవరి16 నుండి 19 వరకు సూర్యాపేట జిల్లా మల్లారెడ్డి గూడెం ప్రాంగణంలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ ఎంపిక పోటీలలో పాల్గొనే క్రీడాకారులు వారి వయసు ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డు, స్కూల్ బోనఫైడ్‌తో రూ.50 ఎంట్రీ ఫీజు తీసుకొని ఉదయం 8 గంటలకు పీఈటీ కొట్టే దేవేందర్‌కి రిపోర్టు చేయాలన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నం.8099150447, 7702115889 సంప్రదించాలని సూచించారు.

ఐఐటీ ఫౌండేషన్ కోర్స్ పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-తాండూర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) విద్యార్థులకు ఐఐటీ, నీట్ ఫౌండేషన్ కోర్స్ మెటీరియల్‌ను సోమవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ గురుకులాలకు అందిస్తున్న వసతి సౌకర్యాలను ఉపయోగించుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. గతంలో సీఓఈ విద్యార్థులు సాధించిన వివరాలను ప్రిన్సిపాల్ ఐనాల సైదులును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో కావాల్సిన అదనపు వసతి సౌకర్యాల గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ కళాశాలలో కావాల్సిన సౌకర్యాలు, ప్రాధాన్యత అంశలను బట్టి మరిన్ని సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కారుకూరి రామచందర్, పేరెంట్స్ కమిటీ గౌరవ అధ్యక్షులు దాగం తిరుపతి, అధ్యక్ష కార్యదర్శులు పుదారి నగేష్ గౌడ్, గోగర్ల రమేష్, ఇప్పరవి, అడ్డూరి వెంకటస్వామి, వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, జేవీవీ నాయకులు పొన్నం శ్రీనివాస్, ఉపాధ్యాయులు యండి కౌసర్, కె.రాజేశ్వర్, దత్త ప్రసాద్, గణపతి పాల్గొన్నారు.

ఓటమితో భయపడాల్సిన అవసరం లేదు

- గులాబీ జెండా పుట్టిందే తెలంగాణ కోసం
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

నవతెలంగాణ-హాజీపూర్



మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు

ఓటమితో భయపడాల్సిన అవసరం లేదని, గులాబీ జెండా పుట్టిందే తెలంగాణ కోసమని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక కళ్యాణ మండపంలో బీఆర్ఎస్ మంచిర్యాల నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఏ విధంగా వ్యవహరించాలో కార్యకర్తలతో దిశానిర్దేశం చేశారు. జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు బాల్క సుమన్, మంచిర్యాల, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యేలు నడిపల్లి దివాకర్ రావు, దుర్గం చిన్నయ్య హాజరై కార్యకర్తలకు ధైర్యం ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండి కూడా ప్రజల కోసం కొట్లడడానికి శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు నెరవేర్చాలన్నారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న రేవంత్ రెడ్డి పదవిని బట్టి స్థాయిని బట్టి మాట్లాడాలని హితవు పలికారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలో ఏ నాయకుడిని పరుష పదజాలంతో దూషించలేదని, కక్ష సాధింపు చర్యలు చేయలేదనీ పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి లాంటి ఆంధ్ర ముఖ్యమంత్రులను తట్టుకొని నిలబడ్డ పార్టీ బీఆర్ఎస్ అన్నారు. ఉద్యమానికి వెన్నుపోటు పొడిచినా కాంగ్రెస్ నాయకులను బీఆర్ఎస్ ప్రభుత్వంలో క్షమించి వదిలేసామన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే రేవంత్ రెడ్డి అహంకారంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఆటో డ్రైవర్లు తిన్నదరగక ధర్నాలు చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారన్నారు. రైతుబంధు కోసం గత ప్రభుత్వంలో విడుదల చేసిన రూ. 7,700 కోట్లు మళ్లించారని ఆరోపించారు. ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో ఒక గ్యారెంటీని కూడా పూర్తిగా అమలు చేయలేదన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ, రూ.4 వేల పెన్షన్, రూ.500 గ్యాస్, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. పరిపాలన గాలికి వదిలేసి ఆస్తులు సంపాదించుకునే పనిలో పడ్డారని విమర్శించారు. హామీలు నెరవేర్చలేక ప్రజల దృష్టిని మరల్చడానికి కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులను తిడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు దండుకోవాలని చూస్తున్నారన్నారు. పెద్దపల్లి పార్లమెంటుపై గులాబీ జెండా ఎగరేద్దామన్నారు. బీఆర్ఎస్‌ది కుటుంబ పాలన అయితే పార్లమెంట్ నియోజకవర్గంలో వినోద్, వివేక్ ఎమ్మెల్యేలు అయ్యారన్న విషయాన్ని మరిచరన్నారు. సంపదలు సృష్టించడానికి పెట్టుబడి పెట్టాలని ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు తెచ్చి అభివృద్ధి దిశవైపు నడిపిందని తెలిపారు. అధికారం కోసం అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలని మభ్యపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 16 సమ్మెను విజయవంతం చేయండి

- ఇళ్ల స్థలాల పోరాట నాయకులపై కేసులు ఎత్తివేయాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్

నవతెలంగాణ-నస్పూర్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్

కేంద్ర ప్రభుత్వ విదానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న జరిగే సమ్మె-గ్రామీణ భారత్ బందును విజయవంతం చేయాలని, చెన్నూరులో ఇళ్ల స్థలాల పోరాట నాయకులపై కేసులు ఎత్తివేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, ఆశయ్య అన్నారు. సోమవారం శ్రీరాంపూర్‌లోని పార్టీ కార్యాలయంలో సీపీఐ(ఎం) జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నదని ఆరోపించారు. ఒకవైపు కార్మికుల చట్టాలను రద్దు చేస్తూ, లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికులను కార్పొరేట్లకు బానిసలుగా మార్చే విధంగా కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. రైతులకు కనీస మద్దతు ఇవ్వకుండా మోసం చేస్తున్నారన్నారు. ఫిబ్రవరి 16న నిర్వహించే సమ్మెలో కర్షకులు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తానన్న ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేయాలని, కార్మికుల కనీస వేతనాల జీఓలను గెజిట్ చేసి, ఇండ్ల స్థలాల పోరాటం చేస్తున్న నాయకులపై పెట్టిన కేసులను ఎత్తి వేయాలని, ఇండ్లు కట్టుకున్న గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల స్థలాల పోరాటంలో పాల్గొన్న ప్రతి కుటుంబానికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంకె రవి, కార్యదర్శివర్గ సభ్యులు కనికరపు అశోక్, గుమాస ప్రకాష్, దాసరి రాజేశ్వరి, ఎర్ర పున్నం, జిల్లా కమిటీ సభ్యులు అశోక్, బోడంకి చందు, దుంపల రంజిత్, దూలం శ్రీనివాస్, రాజారాం, వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని లంబాడితాండ(ఎస్) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లా స్థాయి జిగ్నాస సంచార ప్రయోగశాల నిర్వాహకులు విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు సైన్స్ అంశాలను వివరించారు. మానవ శరీరం, అంతర్గత అవయవాల పని తీరు, ప్రయోగపరికరాల పని విధానం, తదితర సైన్స్ ప్రయోగాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిగ్నాస సంచార ప్రయోగశాల నిర్వాహకులు సాయి కుమార్, సంపత్, హెచ్‌ఎం నెన్నెల లచ్చయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వజ్రోత్సవ వేడుకలకు సిద్ధమైన మందమర్రి కార్మెల్ అకాడమీ

నవతెలంగాణ-మందమర్రి

వజ్రోత్సవ వేడుకలకు మండలంలోని మందమర్రి కార్మెల్ అకాడమీ సిద్ధమైంది. మంగళవారం వజ్రోత్సవ వేడుకలు జరుపుకుంటున్న సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గ్జేవియర్ రెక్స్ ఫాదర్ సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 60 సంవత్సరాల నుండి ఉన్నత విద్యను అందించి ఎందరినో ఉన్నత స్థితిలో నిలవడానికి కారణమైందన్నారు. మంగళవారం నిర్వహించే వజ్రోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా పంచాయతీ రాజ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, విశిష్ట అతిథిగా చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హాజరు అవుతున్నట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం నుండి అర్ధరాత్రి వరకు కార్యక్రమం ఉంటుందని, దీనిలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, వక్తల ఉపన్యాసాలు, ప్రముఖులకు సన్మాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

విద్యార్థులకు ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది అవగాహన



నవతెలంగాణ-మందమర్రి

విపత్తులపై విద్యార్థులకు ఎన్‌డీఆర్‌ఎఫ్‌ఎఫ్ సిబ్బంది అవగాహన కల్పించారు. సోమవారం జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ 10వ బెటాలియన్ టీమ్ కమాండర్ బిటెన్ సింగ్ ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాలలో విపత్తులు (తుఫానులు, వరదలు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు) సంభవించినపుడు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. ప్రజలతో పాటు మనల్ని ఎలా కాపాడుకోవాలో విద్యార్థులకు వివరిస్తు వారితో ప్రయోగత్మకంగా చేయించారు. ప్రథమ చికిత్స, జనాల రక్షణ తదితర వాటిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్ర శేఖర్, మండల విద్యా శాఖాధికారి జాడి పోచయ్య, సెక్టోరియల్ అధికారి సత్యనారాయణ మూర్తి, పాఠశాల ప్రిన్సిపాల్ జయకృష్ణ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి

నవతెలంగాణ-వేమనపల్లి

మండలం చామనపల్లి గ్రామ పంచాయతీలోని పలు అభివృద్ధి కార్యక్రమాలలో సోమవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పాల్గొన్నారు. చామనపల్లి వాగుపై రోడ్లు, వంతెనల నిర్మాణానికి రూ.8కోట్ల 24లక్షలు, సూరారం, బద్దంపల్లి వరకు రూ.7 కోట్ల 7లక్షలు, బొమ్మెన ఒర్రెపై వంతెన నిర్మాణానికి రూ.కోటి 25 లక్షలు,చామనపల్లి వాగు నుంచి గ్రామం వరకు రూ.కోటి 40లక్షలు, చామనపల్లి గ్రామం నుంచి కుశ్నపల్లి రోడ్డు వరకు రూ.కోటి 90 లక్షలు,గ్రామ పంచాయతీ నూతన భవనానికి రూ.25 లక్షల విలువ గల పనులను పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం వేమనపల్లి జెడ్పీటీసీ దంపతులు ఆర్ స్వర్ణలత సంతోష్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల తర్వాత చామనపల్లి గ్రామ ప్రజల కల నెరవేరబోతుందని, సాధ్యమైనంత తొందరలో వంతెన పనులు పూర్తి చేసి ప్రజల రవాణ సమస్యను తొలగిస్తామన్నారు. గ్రామాల్లో ఉన్న నీటి సమస్యను కూడా పరిష్కరించడానికి కృషి చేస్తామని చెప్పారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ప్రభుత్వం ఇప్పటికే రెండు హామీలను ప్రారంభించిందని, ఈ పదిహేను రోజులలో మరో రెండు హామీలు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్‌ను అందించేలా ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, చామనపల్లి గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిదులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జాతర పోస్టర్లు ఆవిష్కరణ

నవతెలంగాణ - కాసిపేట



మండలంలోని కుర్రేఘడ్ గ్రామ శివారులో ఈ నెల 9,10,11 తేదీల్లో నిర్వహించే శ్రీశ్రీశ్రీ పాహుండి కూపర్ లింగు స్వామి జాతర పోస్టర్లను విడుదల చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో డీటీడీవో గంగారాం, ఆర్డీవో చేతుల మీదుగా జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి సోయం జంగు, జాతర కమిటీ ఉపాధ్యక్షులు ఆత్రం అమృత్‌రావ్, మడావి గంగారాం, సిడాం రాందాస్, కోశాధికారి పెంద్రం సింగు, కార్యదర్శి మడావి వెంకటేశ్, సాంస్కృతిక కార్యదర్శి కుర్సింగ తిరుపతి, సలహాదారులు సంద్ర భూమన్న, పెందూర్ ప్రభాకర్, మడావి ప్రకాశ్ పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

నవతెలంగాణ-నార్నూర్



గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని పీహెచ్‌సి డాక్టర్ రాంబాబు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వివిధ గ్రామాల ఆశాలతో సమావేశం నిర్వహించారు. తమ గ్రామాల్లో గర్భిణులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేసి హైరిస్క్ గర్భిణులను గుర్తించాలన్నారు. వారికి సరైన సమయంలో చికిత్స అందించాలన్నారు. ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా 30ఏళ్ల పైబడిన వారికి పరీక్షలు చేసి చికిత్స అందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో సిహెచ్ఓ లక్ష్మి, హెచ్ఇఓ నాందేవ్, పీహెచ్ఎన్ఓ సుశీల, హెల్త్ సూపర్వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, సత్తవ్వ, వైద్య సిబ్బంది దినేష్, హిమబిందు పాల్గొన్నారు.

బాల్య మిత్రునికి సన్మానం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని దేవులగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా పదవీకాలం పూర్తి చేసుకున్న గుర్రం శిరీష గోపాల్ రెడ్డిని బాల్య మిత్రులు 1984-85 పదవ తరగతి బ్యాచ్ ఘనంగా సన్మానించారు. సోమవారం దేవునిగుడా గ్రామపంచాయతీలో బాల్య మిత్రులందరికీ శాలువా పూలమాలలతో సత్కరించి మాట్లాడారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు పొంది ప్రజా సేవలో ముందు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ మెంబర్ సయ్యద్ ఫసీఉల్లా, కొత్త శ్రీనివాస్, ఎండి భద్రోద్దీన్, వోజ్జల శ్రీనివాస్, బండారి శివకుమార్, తోట లచ్చన్న, ఎస్.మనోహర్, ఎస్.రాజన్న ఎల్.దేవుజి, రాజు నాయక్, నర్సింగరావు, వెంకటి పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ వ్యవస్థాపకుడి జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీయూటీఎఫ్ వ్యవస్థాపకులలో ఒకరైన స్వామి రెడ్డి జయంతి వేడుకలను సోమవారం జిల్లా కేంద్రంలో సంఘ భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు తుమ్మలచ్చిరాం, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బేర దేవన్న జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్ జలంధర్ రెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వామిరెడ్డి సంఘ అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షకార్యదర్శులు, సంఘం సభ్యులు ఉన్నారు.

నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం 2024 క్యాలెండరును కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల విధులలో నాల్గవ తరగతి ఉద్యోగుల ప్రముఖ పాత్ర వహిస్తారని, ఉన్నతాధికారుల ఆదేశాలను సమర్థవంతంగా పాటిస్తూ సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం జిల్లా అధ్యక్షులు గీట్ల సుమిత్, ప్రధాన కార్యదర్శి కమ్మల గోవర్ధన్, ఉపాధ్యక్షురాలు కవితారాణి, సంయుక్త కార్యదర్శి చంద్రయ్య పాల్గొన్నారు.

నిజాయితీ చాటిన సీనియర్ జర్నలిస్ట్

నవతెలంగాణ-కుభీర్

మహారాష్ట్రలోని తొటంబ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త సునీత సోమవారం ఆరోగ్యం బాగలేక భైంసా ఆస్పత్రికి వెళ్లి తిరిగి కుభీర్ మండలంలోని చోండి గ్రామం వద్ద పని నిమిత్తం దిగింది. బస్టాండ్ సమీపంలో కూర్చొండగా ఆమె వద్ద ఉన్న బ్యాగ్ అక్కడే మర్చిపోయింది. అటువైపు వెళ్తున్న కుభీర్ సీనియర్ జనరలిస్ట్ కమల్‌దాస్ కింద పడి ఉన్న బ్యాగును చూసి కుభీర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి ఇచ్చి తన నిజాయితీ చాటుకున్నారు. అందులో రూ.9450 నగదుతో పాటు ఏటీఎం, క్రెడిట్ కార్డులు, ఇతర వస్తువులున్నాయి. ఆయన వెంటనే కుభీర్ ఏఎస్సై శివయ్య ఆధ్వర్యంలో పోగొట్టుకున్న సునీతకు నగదు అందించారు. దీంతో ఆయనకు కుభీర్ పోలీసులు అభినదించారు. ఇందులో కానిస్టేబుల్ భాస్కర్, కమల్‌దాస్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సేవాలాల్ జయంతికి పీఓకు ఆహ్వానం

నవతెలంగాణ-ఉట్నూర్

ఈనెల 15న నిర్వహించే సేవాలాల్ జయంతికి ఐటీడీఏ పీఓకు జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలోని ఆమె ఛాంబర్‌లో ఉత్సవ కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు రాథోడ్ మహేందర్, గౌరవ అధ్యక్షులు జాదవ్ వసంత్ రావు, ప్రధాన కార్యదర్శి రాథోడ్ మహేందర్, ఉపాధ్యక్షుడు సచిన్, తరుణ్, రాహుల్ కోశాధికారి కార్తీక్, న్యాయ సలహాదారులు బానోత్ జగన్, సలహాదారులు రాథోడ్ సుధాకర్, రాథోడ్ గణేష్, పవార్ విజయ్, బానోత్ రవీందర్, నేతావత్ రాందాస్, జాదవ్ వసంత్ రావు పాల్గొన్నారు.



పార్లమెంట్ ఎన్నికలకు ఈవీఎంలను సిద్ధం చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికలకు ఈవీఎంలను సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి దశ తనిఖీలో భాగంగా సోమవారం నస్పూర్‌లోని ఈవీఎం గోదాం, హాజీపూర్ మండలం ముల్కల్లలోని ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్లను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, చెన్నూర్ ప్రత్యేక సబ్-కలెక్టర్ సిడాం దత్తులతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మొదటి దశ తనిఖీ నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలో 850 బ్యాలెట్ యూనిట్లు, 838 కంట్రోల్ యూనిట్లు, 1092 వీవీ ప్యాట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మొదటి దశ తనిఖీ ప్రక్రియ పూర్తి అయ్యే వరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తనిఖీ సమయంలో తప్పనిసరిగా హాజరు కావాలని, ఎన్నికల విభాగం అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ మేళాకు విశేష స్పందన

నవతెలంగాణ-హాజీపూర్

రాష్ట్ర ఫోటో, వీడియో గ్రాఫర్స్, జిల్లా ప్రొఫెషనల్ ఫోటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఫోటోటెక్ పరివార్ సహకారంతో నిర్వహించిన మేళాకు విశేష స్పందన వచ్చింది. సోమవారం మండలంలోని వేంపల్లిలోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ ఫోటో ఎగ్జిబిషన్‌కు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఫోటోగ్రాఫరులు పాల్గొన్నారు. ముందుగా ఫోటో పితామహుడు డ్యాగురే చిత్రపటానికి పూలామలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఫోటోగ్రాఫర్స్ మేళాలో ఫోటోటెక్ ఎడిటర్ భూపాల్ ఆధ్వర్యంలో ఫోటోగ్రాఫర్లకు ఫోటోషాప్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)పై శిక్షణ ఇచ్చారు. ఫోటో లైటింగ్, మోడల్ షూట్, రీ టచ్చింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం ఫోటో పరివార్ ఆధ్వర్యంలో కుటుంబ భరోసా కలిగి ఉన్న ఫోటోగ్రాఫర్లకు ఉచితంగా ఫోటో పరివార్ కార్డులను అందజేశారు. పరివార్ కార్డుతో ఆల్బమ్ ప్రింటింగ్ సమయంలోనే కాకుండా ఫోటో కెమెరాల కొనుగోలు చేసేటప్పుడు ప్రత్యేక తగ్గింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫోటో,



వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసగౌడ్, మాజీ కోశాధికారి జూరూరి మధు, జిల్లా అధ్యక్షుడు కలర్స్ సతీశ్, ఫోటోటెక్ సీఈఓ అభిమన్యు, సబ్ ఎడిటర్ ఓంప్రకాశ్, ఫోటో, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలి



నవతెలంగాణ-నస్పూర్

ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కారించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీఓలు వి. రాములు, హరికృష్ణలతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని, ఒకే వేదికగా ప్రజల సంబంధిత అర్జీలను స్వీకరించి సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించడం కోసం కృషి చేస్తున్నామన్నారు. జిల్లాకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు పెండింగ్‌లో లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 65 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాసిపేటలో...

మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా వాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎంఏ అలీం కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, ఏఈ వినయ్, అధికారులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచులకు ఘన సన్మానం

నవతెలంగాణ-కాసిపేట

మండల పరిషత్ కార్యాలయంలో పదవీ కాలం పూర్తి చేసుకున్న మాజీ సర్పంచులను సత్కరించారు. సోమవారం సన్మాన సభ ఏర్పాటు చేసి శాలువాలు, పూలమాలలతో అధికారులు, ప్రజా ప్రతినిధులు సన్మానించారు. వీరితో పాటు ఎంపీడీఓ, ఎంపీఓ, జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలకు మాజీ సర్పంచులు సన్మానం చేశారు. ఐదేండ్ల పాటు ప్రజలతో అధికారులతో ఉన్న సంబంధాలు, చేసిన పనులపై తమ పదవీ కాల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ అభిప్రాయాలను మాజీ సర్పంచులు తెలియజేసి, సహకరించిన అధికారులు, ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచులు వారి కాలంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి, మంచి పనుల వల్లే ఎల్లకాలం గుర్తింపు ఉంటుందని, ఐదేండ్ల పాటు చేసిన సేవలను కొనియాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, జెడ్పీటీసీ పల్లె చంద్రయ్య, వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఏ అలీం, ఎంపీఓ నాగరాజు, ఎంపీటీసీలు కొండబత్తుల రాంచందర్, అక్కెపల్లి లక్ష్మీ, పర్వతి మల్లేశ్, చంద్రమోళి, భీంరావు, పద్మ, డీటీ మానిర్‌రావు, మాజీ సర్పంచులు సపాట్ శంకర్, ఆడె బాదు, వేముల కృష్ణ, రాంటెంకి శ్రీనివాస్, దరావత్ దేవి, దుస్స విజయ, ఆడె సౌందర్య, భూక్య సునీత, అజ్మీర తిరుపతి, సంపత్ నాయక్, ఆడె జంగు, విజయలక్ష్మి, పెంద్రం రాజు, పెంద్రం కవిత, స్వరూప, సుశీల, లక్ష్మీ పాల్గొన్నారు.



అవమానపరిచారు ఉప సర్పంచుల ఆరోపణ

ఉప సర్పంచులు కూడా గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయడానికి ఎంతో కృషి చేశారని, సర్పంచ్‌ల భర్తలకి ఇచ్చిన గౌరవం కూడా ఉప సర్పంచులకు ఇవ్వకపోవడం అవమానకరమని ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు బోయిని తిరుపతి యాదవ్ అన్నారు. ఉప సర్పంచులకు చెక్ పవర్ ఇచ్చి ప్రభుత్వం తగిన గౌరవం ఇచ్చిందన్నారు. కానీ అధికారులు సర్పంచుల భర్తలను పిలిచి వారిని కూడా సన్మానించారని, కానీ ఉప సర్పంచులను కనీసం ఆహ్వానించకపోవడం చాలా బాధాకరమన్నారు.

నాగోబా జాతరకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

నాగోబా జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో నాగోబా జాతర ఏర్పాట్లపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవం నాగోభా జాతరను ఘనంగా, సాంప్రదాయ బద్దంగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఫిబ్రవరి 9 నుండి 15 వరకు జరగనున్న జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున శానిటేషన్, హైపో క్లోరైడ్ ద్రావణం పిచికారీ చేయాలన్నారు. వీధి లైట్లు, హైమాస్ లైట్‌లను ఏర్పాట్లు చేయాలని, వైద్య శిబిరాల ఏర్పాటుతో అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచి నిరంతర వైద్య సేవలు అందించాలన్నారు. నీటి సరఫరా, మరుగుదొడ్లు అవసరమైన మేరకు ఏర్పాటు చేయాలనీ, పార్కింగ్, బారికేడ్స్ ఏర్పాటు చేయాలనీ, ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పనులను అధికారులు సమన్వయంతో చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో డీడీ దిలీప్ కుమార్, డీఎస్పీ నాగేందర్, ఈఈ రాథోడ్ భీంరావ్, ఏపీఓ భాస్కర్, ఈఓ రాజమౌళి, ఏఓ రాంబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి కంటిచూపు కల్పించడమే లక్ష్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ పరిధిలోని ప్రతి ఒక్కరికి కంటిచూపు కల్పించడమే తమ లక్ష్యమని జెడ్పిటిసి నాగేశ్వరరావు అన్నారు. తన తండ్రి అరిగెల లక్ష్మయ్య జ్ఞాపకార్థం గతంలో మండలంలోని చిర్రకుంట గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించి ప్రత్యేక బస్సులో శస్త్ర చికిత్స నిమిత్తం పంపించారు. ప్రత్యేక బస్సుకు మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి జెండా ఊపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పరిధిలోని ప్రతి ఒక్కరికి కంటి చూపు కల్పించడమే ధ్యేయమన్నారు. దీనికోసం గతంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించినట్లు వివరించారు. ఖర్చులు తామే భరించి ప్రతి ఒక్కరికి శస్త్ర చికిత్స చేయించనున్నట్లు వివరించారు. 200 మందికి శస్త్ర చికిత్సలు చేయించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వేణు, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకులు సుంకరి పెంటయ్య, సత్రవేణి మల్లేష్ పాల్గొన్నారు.

అట్టహాసంగా క్రికెట్ పోటీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంజనీపుత్ర రియల్ ఎస్టేట్స్ కంపెనీ వారి ఆధ్వర్యంలో సోమవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. పోటీలను జనరల్ మేనేజర్ చింతల లింగన్న టాస్ వేసి ప్రారంభించారు. అంతకుముందు ఆటగాళ్లను పరిచయం చేసుకున్నారు. వాన్వట్ బాయ్స్ వర్సెస్ టైగర్ బాయ్స్ మధ్య పోటీలు జరిగాయి. వాన్వట్ టీమ్ కెప్టెన్‌గా జుబెర్, టైగర్ టీమ్ కెప్టెన్‌గా నజ్జు వ్యవహరించారు. కార్యక్రమంలో అంజనీపుత్ర కంపెనీ సభ్యులు కంకటి కృష్ణ, జంగం మహేష్, మల్యాల కృష్ణకాంత్, కంపెల్లి శ్యామ్, మల్యాల సంప్రీత్, కేమ గంగయ్య పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాల పంపిణీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని జీడిచేను ఎంపీపీఎస్ పాఠశాలలో దివ్యాంగ చిన్నారులకు ఉపరకరణాలను సోమవారం ఎంఈఓ భిక్షపతి పంపిణీ చేశారు. దివ్యాంగులు సవ్యాంగులతో పాటు రాణించేల ప్రతి ఒక్కరు మనోధైర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం అనురాధ బాయి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సమత, ఐఈఆర్‌పీ సతీష్, సీఆర్పీ అర్జున్ పాల్గొన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-జైపూర్

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. సోమవారం మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రేవంత్ రెడ్డి పట్ల అసభ్యకరంగా మాట్లాన తీరును ఖండించారు. రేవంత్ రెడ్డి హెచ్చరిస్తూ చెప్పు తీసి చూపించి అసభ్యకరంగా మాట్లాడిన తీరుపై టేకుమట్ల గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ గోనె నరసయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

సేఫ్టీ జీఎంను సన్మానించిన అధికారులు

నవతెలంగాణ-రెబ్బెన

కొత్తగూడెం రీజియన్ సేఫ్టీ జీఎం కేవీ తివారీని సోమవారం బెల్లంపల్లి ఏరియా అధికారులు శాలువాతో ఘనంగా సన్మానించారు. జీఎం సేఫ్టీ హోదాలో మొదటిసారి బెల్లంపల్లి ఏరియా సందర్శనకు వచ్చిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఖైరిగూడ ఉపరితల గనిని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం మచ్చగిరి నరేందర్, డీజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహెర, డీజీఎం ఎఫ్అండ్ఎ రామారావు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

NOTICE

IN THE COURT OF DISTRICT JUDGE (MACT) AT KARIMNAGAR
O.P. No.(211) of 2023

Between:-
Dharavath Ashok & another. ...Petitioners
AND
Sambaru Venkatesh & Others. ...Respondents

TO
R3] Mr.A.Mallaiah s/o not known Aged: 40 yrs, Occu: Previous Owner of Royal Enfield Bike/Motor cycle bearing No: TS-16-EN-7574, R/o H.No: 27-397, Hamaliwada locality of Mancherial proper, Post & Mandal: Mancherial District: Mancherial- 504 208 (T.S.)

Whereas the above named petitioners had filed the above case u/s 166 (1)(C) of M.V.Act, against the Respondents for grant of compensation on account of death of their son namely Dharavath Sridhar who died in a motor vehicle accident and you are evading the Notices issued by this court.

Take notice that the above case stands posted on 19-03-2024 at 10.30 A.M. for your appearance and counter if any, failing which the matter will be decided in your absence.

//BY ORDER OF THIS COURT//
Dated: 04-02-2024

Sd/-
POLASA RAMMOHAN
Advocate for Petitioners
Karimnagar.
Cell No: 98851 65405